క్లుప్తంగా

రేపు వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం



శ్రీదేవి భూదేవి వేంకటేశ్వరస్వామి

తాండూరు రూరల్: మండల పరిధిలోని అంతారం అనుబంధ గ్రామం దస్తగిరిపేట్‌లో శ్రీదేవి భూదేవి వేంకటేశ్వర స్వామి దేవాలయ కల్యాణోత్సవం శనివారం నిర్వహించనున్నారు. ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం రథోత్సవం, సాయంత్రం అశ్వవాహనము నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ, ధర్మకర్తలు వెంకట్‌చార్ శుక్రవార్, పురం ,ధర్మాచార్ శుక్రవార్, రాఘవచార్ శుక్రవార్‌లో తెలిపారు.

ఫైనాన్స్ కమిషన్ సభ్యుడికి సన్మానం



రమేశ్ మహరాజ్‌ను సన్మానిస్తున్న నాయకులు

యాలాల: రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యుడిగా నియమితులైన రమేశ్ మహరాజ్‌ను గురువారం కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు సన్మానించారు. కోఆప్షన్ సభ్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు అక్బర్‌బాబా ఆధ్వర్యంలో నాయకులు కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రమేశ్ మహరాజ్‌కు రాష్ట్రస్థాయి నామినేటెడ్ పదవి దక్కడం హర్షణీయమన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలకు ఆయన చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు నాగయ్య, శ్రీనివాస్, అహ్మద్, మారుతీ, అశోక్‌నాయిా, శేఖర్, అజీజ్, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

మార్చి 3న పల్స్ పోలియో



మాట్లాడుతున్న వైద్యాధికారులు

యాలాల: పల్స్ పోలియో పంపిణీ కార్యక్రమాన్ని మార్చి 3న చేపట్టనున్న పీహెచ్‌సీ వైద్యురాలు అనూష తెలిపారు. గురువారం మండల పరిషత్ సమావేశ హాలులో అంగన్‌వాడీ టీచర్లు, వలంటీర్లకు నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమానికి పకడ్బందీగా నిర్వహిస్తామన్నారు. మండలంలో 42 బూత్‌లకు ఒక మొబైల్ టీం ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఐదేళ్లలోపు చిన్నారులు మండలంలో 4,070 మంది ఉన్నట్లు గుర్తించామన్నారు. వీరందరికి సకాలంలో పోలియో చుక్కలను వేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ చంద్రశేఖర్, సూపర్‌వైజర్లు శోభారాణి, సిబ్బంది బసయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.


పెట్రోల్ పంపు ప్రారంభం



పెట్రోల్ పంపును ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే తదితరులు

నవాబుపేట: మండల పరిధిలోని పూలపల్లి గేట్ వద్ద ఇటీవల నిర్మించిన శ్రీసాయిరామ్ పెట్రోల్ పంపును గురువారం ఎంపీ రంజిత్ రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పెట్రోల్ పంపు యజమాని విఠల్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రాంరెడ్డి, వైస్ చైర్మన్ నర్సింహారెడ్డి, డైరెక్టర్లు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నాగిరెడ్డి, నాయకులు పాండురంగారెడ్డి, అజయ్‌కుమార్, మహేందర్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ విజయ్‌కుమార్

కొడంగల్: ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లపై గురువారం ఓటర్లకు అవగాహన కల్పించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఓటింగ్ విధానాన్ని వివరించారు. ఈవీఎంలు పనిచేసే పద్ధతిని తహసీల్దార్ విజయ్‌కుమార్ వివరించారు. కార్యక్రమంలో రెవెన్యూ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పేరుకే ఎంపీటీసీలు

నిధులు లేక సతమతం
- హామీలు అమలు చేయలేక ఇబ్బందులు
- ప్రాధాన్యం ఇవ్వాలంటూ వినతులు

దౌల్తాబాద్: పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా ఎంపీటీసీ సభ్యుల పరిస్థితి నెలకొంది. ఎన్నికల్లో గెలిచిన సంతోషం కొంత కాలానికే కనుమరుగవుతోంది. గెలిచేందుకు రూ.లక్షల్లో ఖర్చు పెట్టినా ప్రభుత్వం నుంచి ప్రత్యేకంగా నిధులు రాకపోవడంతో ఏం చేయాలో తెలియక సతమతం అవుతున్నారు. సర్పంచుల మాదిరిగానే ఎన్నికల్లో ప్రజల ఓట్లతో గెలిచినా తమకు కనీస గౌరవం లేకుండా పోతుందని గ్రామ పంచాయతీల్లో ఓ సీటు కూడా ఉండదని.. మండల పరిషత్‌లో కూడా తమకంటూ ఓ గది కూడా కేటాయింపులేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాంటప్పుడు ఎంపీటీసీల వ్యవస్థ ఎందుకని ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుత ఎంపీటీసీ సభ్యులు గెలిచి దాదాపు ఐదేళ్లు కావస్తుంది. అయితే ప్రభుత్వం నుంచి ఎటువంటి నిధులు మంజూరు చేయకపోవడంతో గ్రామాల్లో తమకు ఓట్లు వేసి గెలిపించిన ప్రజలకు సమాధానం చెప్పలేక, అభివృద్ధి పనులు చేయలేక తీవ్ర అవస్థలు పడుతున్నారు.

కొత్త ప్రభుత్వంపై ఆశలు

దౌల్తాబాద్ మండలంలో 33 గ్రామ పంచాయతీలుండగా 15మంది ఎంపీటీసీ స్థానాలున్నాయి. 2019 మే లో ఎన్నికలు జరగగా 7న ప్రమాణస్వీకారం చేశారు. అప్పటి నుంచి గత ప్రభుత్వం ఒక్క రూపాయి నిధులు విడుదల చేయలేదు. ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడి 60 రోజులు కావస్తుంది. ఎంపీటీసీలకు నిధులపై ఎలాంటి సమాచారం లేదు. అప్పుడప్పుడు విడుదలవుతున్న జిల్లా పరిషత్ నిధులతో కొందరు ఎంపీటీసీలు అరకొర పనులు చేపట్టారు. ప్రతీ మూడు నెలలకోసారి నిర్వహించే మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఇచ్చే చాయ్, బిస్కెట్ల కోసమే తాము హాజరవుతున్నట్లు ఉందని పలువురు ఎంపీటీసీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్కడ ఒక్కరో ఇద్దరో ఎంపీటీసీ సభ్యులు ప్రజాసమస్యలపై చర్చ లేవనెత్తినా వాటిని అప్పటికప్పుడు పరిష్కరిస్తామని అంటున్నారే కానీ.. ఆ తర్వాతే పట్టించుకునే వారే కరువయ్యారని ఆరోపిస్తున్నారు. అదే విధంగా ఎంపీటీసీ సభ్యులకు ఇచ్చే గౌరవ వేతనం కూడా సక్రమంగా అందడంలేదని వాపోతున్నారు. మిగిలిన మూడున్నర నెలల కాలంలోనైనా కొత్త ప్రభుత్వం తమకు నిధులు కేటాయిస్తే గ్రామాల్లో అభివృద్ధి పనులు చేయిస్తామని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



దౌల్తాబాద్ ఎంపీడీఓ కార్యాలయం

అభివృద్ధిలో భాగస్వాములను చేయాలి



ప్రత్యేకాధికారుల పాలన కాలంలోనైనా అధికారులతో పాటు మాకు అభివృద్ధి పనుల్లో భాగస్వాములు అయ్యే విధంగా ప్రభుత్వం అధికారికంగా ప్రకటిస్తే బాగుంటుంది. మాకంటూ ఎలాంటి నిధులు లేకపోవడంతో గ్రామాల్లో తిరగలేని పరిస్థితి ఉంది. ఇక కొత్త ప్రభుత్వంలోనైనా నిధులు కేటాయించి ఎంపీటీసీలను గుర్తించాలి.

– కుర్మనిమంజుల, ఎంపీటీసీ, దౌల్తాబాద్

నేడు చెంగోల్‌లో శివపార్వతుల కల్యాణం

తాండూరు రూరల్: మండల పరిధిలోని చెంగోల్ గ్రామంలో శుక్రవారం శివపార్వతుల కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. మల్లికార్జునస్వామి దేవస్థానం 22వ వార్షికోత్సం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కల్యాణానికి శివభక్తులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

నక్ష బాటను పునరుద్ధరించండి

నవాబుపేట: నక్ష బాటను కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మాదారం గ్రామస్తులు గురువారం తహసీల్దార్ జైరామ్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలోని 97, 117 సర్వే నంబర్ల మధ్య పొలాలకు వెళ్లేందుకు ఎన్నో ఏళ్లుగా నక్ష బాట ఉందన్నారు. గ్రామానికి చెందిన కొంతమంది తమ పొలాల్లో కలిపేసుకున్నారని తెలిపారు. దీంతో అవతలి పొలాలకు వెళ్లేందుకు అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే బాటను పునరుద్ధరించాలని కోరారు.

బోధన అర్థవంతంగా ఉండాలి

కాంప్లెక్స్ నోడల్ అధికారి వెంకట్

దోమ: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉపాధ్యాయులు అర్థవంతమైన బోధనను అందించేలా చర్యలు తీసుకోవాలని మండల నోడల్ అధికారి వెంకట్ సూచించారు. గురువారం మండల పరిధిలోని బుద్లాపూర్, బ్రహ్మణపల్లి, కిష్టాపూర్ పాఠశాలలను కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు లాల్యనాయక్‌తో కలసి ఆయన సందర్శించారు. అనంతరం పదో తరగతి విద్యార్థుల ఇంటర్నల్ మార్కుల జాబితాలను పరిశీలించి మాట్లాడారు. ప్రతి ఉపాధ్యాయుడు సమయం కంటే ముందే పాఠశాలకు చేరుకొని విద్యార్థులకు అడిషనల్ తరగతులను తీసుకోవాలన్నారు. వెనుకబడిన విద్యార్థుల పట్ల శ్రద్ధ చూపి మెరుగైన ఫలితాలను రాబట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. బడికి రాని విద్యార్థుల ఇంటికి వెళ్లి తల్లిదండ్రులతో చర్చించి పాఠశాలకు తీసుకువచ్చే విధంగా కృషి చేయాలన్నారు. ఎండల తీవ్రత రోజు రోజుకు పెరిగిందని, ప్రతి విద్యార్థి ఇంటి నుంచే వాటర్ బాటిల్ తెచ్చుకునేలా చూడాలన్నారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల మార్కులను పరిశీలిస్తున్న వెంకట్

‘పది’లో ఉత్తమ ఫలితాలకు కృషి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జహీర్ పాషా

జీఎంకే ట్రస్టు కోఆర్డినేటర్ జహీర్ పాషా

బంట్వారం: ప్రణాళికబద్ధంగా చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని జీఎంకే ట్రస్టు కోఆర్డినేటర్ జహీర్ పాషా అన్నారు. గురువారం మండల పరిధిలోని తొర్మామిడి ఉర్దూ మీడియం పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన పరీక్షల ప్రిపరేషన్‌పై విద్యార్థులకు పలు సలహాలు, సూచనలను చేశారు. పరీక్షా కేంద్రంలో ఎలాంటి ఒత్తిడికి గురి కాకుడదన్నారు. ముందుగా ప్రశ్నపత్రాలను చూసుకోవాలన్నారు. ఏమైనా సందేహాలు ఉంటే ఇన్విజిలేటర్ల దృష్టికి తీసుకు వెళ్లాలన్నారు. పరీక్షల సమయం దగ్గర పడుతున్నందున టీవీలు, సెల్‌ఫోన్లకు పూర్తిగా దూరంగా ఉండాలన్నారు. ప్రతిరోజు వేకువజామున నాలుగు గంటలకే నిద్ర లేవాలన్నారు. రాత్రిపూట 8 గంటల లోపే భోజనం పూర్తి చేసి 11 గంటల వరకు చదువుకోవాలన్నారు. 5 నుంచి 6 గంటలు ప్రశాంతంగా నిద్రిస్తే సరిపోతుందన్నారు. కోపం, చికాకు, నెగెటివ్ ఆలోచనలు ఉండ కూడదన్నారు. ఇష్టంగా చదివితే లక్ష్యాన్ని చేరుకోవడం పెద్ద కష్టమేమి కాదంటూ ఆయన విద్యార్థులకు హితబోధ చేశారు.

విద్యార్థులే పాఠాలు బోధించి



విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం

కొడంగల్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి పాఠాలు చెప్పారు. జిల్లా కలెక్టర్‌గా నిఖిత, డీఈఓగా షణ్ముక ప్రియ, ఎంఈఓగా సాయి నిహాల్, హెచ్‌ఎమ్‌గా విజయకుమార్‌లతో పాటు పలువురు విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించినట్లు ప్రధానోపాధ్యాయుడు తెలిపారు. అలాగే బాలాజీ కేజీ ఏయిడెడ్ ఉన్నత పాఠశాలలో 20 మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు హెచ్‌ఎంలు మురళీధర్, వెంకటప్ప, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

దైవ చింతనతో మానసిక ప్రశాంతత

ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: దైవ చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని చేవెళ్ల ఎంపీ డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. చేవెళ్ల మండలంలోని న్యాలట గ్రామంలో గురువారం శివస్వాములు ద్వాదశ జ్యోతిర్లింగాల మహాపడి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలను సన్మమార్గంలో నడిపించేందుకు దైవభక్తి దోహదం చేస్తోందని చెప్పారు. అందుకే భక్తులు మాలధరించి భక్తిభావంతో పూజలు చేస్తారన్నారు. అనంతరం మండలంలోని పలు వివాహ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పి ప్రభాకర్, సత్తయ్య, రాములు, ఎల్లేశ్, గురుస్వామి సురేశ్, శివమాలధరించిన భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



చేవెళ్ల: మహాపడి పూజలో ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య

కొందుర్గులో..

కొందుర్గు: మండలంలోని ముట్పూర్‌లో గురువారం శివనామస్మరణతో మార్మోగింది. హనుమాన్ దేవాలయ ప్రాంగణంలో ద్వాదశ జ్యోతిర్లింగ మహాపడిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాలకు చెందిన శివస్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానం చేశారు.

చెట్ల నీడే దిక్కు

దుస్థితిలో ఆర్టీసీ బస్ షెల్టర్లు
- పట్టించుకోని అధికారులు

బంట్వారం: నిర్వహణ లోపంతో ఆర్టీసీ బస్ షెల్టర్లు దయనీయంగా మారాయి. సంబంధిత అధికారులు మాత్రం పట్టనట్లుగా వ్యవహరిసున్నారు. దీంతో ప్రయాణికులు కూర్చునేందుకు చెట్ల నీడనే దిక్కవుతుంది. కోట్‌పల్లి మండలంలోని ఎన్కెపల్లి, జిన్నారం బస్ షెల్టర్లను మేకల కాపరులు పాకలుగా వినియోగిస్తున్నారు. అక్కడే మేకల మందలు ఉంచుతున్నారు. దీంతో అపరిశుభ్రంగా మారడంతో ప్రయాణికులు కూర్చోవడం లేదు. మోత్కుపల్లి గేటు, బార్వాద్ తండా, రాంపూర్, ఓగులాపూర్, నాగసాన్‌పల్లి, ఎన్నారం, బంట్వారం మండలంలోని యాచారం గేటులో బస్ షెల్టర్లు నిర్మించారు. కానీ వాటి నిర్వహణను గాలికి వదిలేయడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారుతున్నాయి. మందుబాబులు పట్టపగలే బస్ షెల్టర్లలో కూర్చుని మందు తాగుతున్నారని ప్రయాణికులు వాపోతున్నారు. అసలే చెత్తాచెదారంతో నిండి ఉండే షెల్టర్లు ఆపై మందు బాబులకు కేంద్రాలుగా మారడంతో ప్రయాణికులు అక్కడికి వెళ్లాలంటేనే జంకుతున్నారు. చెట్ల కిందనే బస్సులు, ఆటోల కోసం నిరీక్షిస్తున్నారు తప్పా బస్ షెల్టర్లలోకి వెళ్లడం లేదు. ఇప్పటికైనా ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. పోలీసులు గస్తీ నిర్వహించి అసాంఘిక కార్యకలాపాలకు చెక్ పెట్టాలని ప్రయాణికులు అభ్యర్థిస్తున్నారు.



బార్వాద్ గేటు వద్ద బస్ షెల్టర్ దుస్థితి



మేకల మందతో ఎన్కెపల్లి బస్టాప్

బీఆర్‌ఎస్‌కు పట్టిన పీడ వదిలింది

మున్సిపల్ కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి

తాండూరు: మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్నపరిమళ్ కాంగ్రెస్ పార్టీలో చేరడంతో బీఆర్‌ఎస్ పార్టీకి పట్టిన పీడ వదిలిపోయిందని మున్సిపల్ కౌన్సిలర్ వరాల శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. తాండూరు మున్సిపాలిటీకి చైర్‌పర్సన్‌గా నాలుగేళ్ల పాటు కొనసాగి ఎన్నో అక్రమాలకు పాల్పడ్డారన్నారు. చిలుకవాగులో రూ.10 లక్షలు వెచ్చించి పూడిక తీయిస్తే చైర్‌పర్సన్ బిల్లులు కాజేశారని ఆరోపించారు. మరోవైపు కోవిడ్ లాక్‌డౌన్ సమయంలో బ్లీచింగ్ పౌడర్ పేరిట రూ.లక్షలను స్వాహా చేశారన్నారు. అంతే కాకుండా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో దొంగోటు వేసి అడ్డంగా దొరికిపోయారన్నారు. లాక్‌డౌన్ సమయంలో మున్సిపల్ సిబ్బందితో దుకాణదారుల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడటంతో పాటు రూ.లక్షల విలువ చేసే సిగరెట్‌లకు సైతం కాజేసిన చరిత్ర మున్సిపల్ చైర్‌పర్సన్‌దన్నారు. నాలుగేళ్లుగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశాలను సరిగా నిర్వహించకపోవడంతో తాండూరు అభివృద్ధి కుంటుపడిందన్నారు. సొంతపార్టీ కౌన్సిలర్‌లే చైర్‌పర్సన్‌ను విభేదించి అవిశ్వాసం పెట్టేందుకు సిద్ధమైన విషయాన్ని గుర్తు చేశారు. అందులో భాగంగానే బీఆర్‌ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్‌పార్టీలో చేరారన్నారు.

ఎల్లమ్మ ఆలయ కమిటీ పునరుద్ధరణ

బొంరాస్‌పేట: నియోజకవర్గ పరిధిలోని దుద్యాల మండలం పోలెపల్లి ఎల్లమ్మ ఆలయ కమిటీని పునరుద్ధరణ చేశారు. నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన నూతన కమిటీ గురువారం రాత్రి ప్రమాణస్వీకారం చేశారు. కడా అధికారి వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ కమిటీ చైర్మన్‌గా పోలెపల్లికి చెందిన జయరాములు, సభ్యులుగా బేగరి నర్సింహులు, కొండని మునికుమార్, కొత్తూరు రాములు, కోడిగంటి వెంకటయ్య, కుమ్మరి యాదయ్య, ఏదుల నర్సింహులు, సున్నల లక్ష్మి ప్రమాణ స్వీకారం చేశారు.

మాతాపితరుల దినోత్సవం

షాద్‌నగర్: సంత శ్రీ ఆసారాం బాపూజీ ఆశ్రమం, శ్రీ యోగా వేదాంత సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో రాఘవేంద్ర కాలనీలోని రంగరాయ ఆడిటోరియంలో మాతృ, పితృ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన డాక్టర్ అమర్‌నాథ్, శరత్‌లు మాట్లాడారు. ప్రతి ఇల్లు దేవాలయం లాంటిదని, తల్లిదండ్రులు దైవ సమానులని, వారిని గౌరవించే బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. నేటి సమాజంలో పాశ్చాత్య పోకడలు అధికమయ్యాయని, సంస్కృతి, సాంప్రదాయాలను మరిచిపోతున్నారన్నారు. పిల్లలు పెద్దయ్యాక జన్మనిచ్చిన తల్లిదండ్రులకు దూరంగా ఉంటున్నారన్నారు. దీంతో వారు అనాథ ఆశ్రమాలకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొందన్నారు. తల్లిదండ్రులను పూజిస్తే ముక్తి లభిస్తుందన్నారు. అనంతరం విద్యార్థులు తల్లిదండ్రులకు పూజలు చేశారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న నాయకులు

కుల్కచర్ల: గిరిజన తండాలకు ఇకపై మహర్దశ పట్టనుందని కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్ అన్నారు. గురువారం మండల పరిధిలోని బండమీదితండా గ్రామపంచాయతీ అనుబంధ గ్రామమైన తుపాకులతండాలో ఉపాధిహామీ నిధులు రూ.5 లక్షలతో సీసీ రోడ్డు పనులను ఆయన అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ వెనుకబడిన వర్గాల ప్రజలకు అండగా ఉంటుందన్నారు. తండాలను అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్లేందుకు ప్రత్యేక పథకాలను పార్టీ రూపొందిస్తుందన్నారు. కార్యక్రమంలో వినోద్‌కుమార్, ఎల్లయ్య, రవి, నర్సింలు, చందు, లక్ష్మణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సంకల్ప యాత్రకు బీజేపీ శ్రేణులు



రేగడిమైలారంలో యాత్రకు తరలుతున్న బీజేపీ నేతలు

బొంరాస్‌పేట: పార్లమెంటు ఎన్నికల సందర్భంగా ముందస్తు ప్రచారంగా బీజేపీ నేతలు తలపెట్టిన విజయ సంకల్ప యాత్రకు బొంరాస్‌పేట, దుద్యాల మండలాల నుంచి బీజేపీ బలగం వెళ్లింది. గురువారం కొడంగల్ పట్టణ కేంద్రంలో నిర్వహించిన బహిరంగ సభకు మహిళలు, యువకులు పార్టీ నాయకులు వెళ్లారు. మండల కేంద్రంతోపాటు తుంకిమెట్ల, రేగడిమైలారం, మెట్లకుంట, ఎన్కేపల్లి తదితర గ్రామాల వారు పాల్గొన్నారు. ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ సాగర్, పార్టీ మండలాధ్యక్షుడు నర్సిములు, బాబయ్యనాయుడు, నాగూరావు, విశ్వనాథం, మహేశ్, శంకర్ తదితరులున్నారు.



హంసాన్‌పల్లిలో..

చెరువుల పరిరక్షణకు కృషి

చేవెళ్ల: జిల్లాలోని ముదిరాజ్‌ల ఉపాధికి ఉపయోగపడే చెరువుల పరిరక్షణకు ఫిషరీస్ సొసైటీ కృషి చేయాలని జిల్లా అధ్యక్షుడు మన్నే వెంకటేశ్ పేర్కొన్నారు. చేవెళ్ల మండలకేంద్రంలోని ఫిషరీస్ సొసైటీ కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గం నూతన అధ్యక్షుడిగా తెలుగు వెంకటేశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకొని నియామక పత్రం అందజేశారు. అనంతరం మన్నే వెంకటేశ్ మాట్లాడుతూ జిల్లాలోని చెరువులు ఆక్రమణలకు గురవుతున్నాయన్నారు. వాటిని కాపాడుకోవలసిన బాధ్యత ఫిషరీస్ సొసైటీలపై ఉందన్నారు. అనంతరం నూతన నూతన అధ్యక్షుడు తెలుగు వెంకటేశ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యత అప్పగించినందుకు రాష్ట్ర, జిల్లా కమిటీ నాయకులను ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో ఫిషరీస్ సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. వికారాబాద్ అధ్యక్షుడు తెలుగు రాఘవేందర్, సొసైటీ సభ్యులు మాణిక్యం ,శ్రీనివాస్, లింగం, మాసయ్య, వెంకటయ్య, పోచయ్య, ఆనంద్, జనార్దన్ పాల్గొన్నారు.